క్లుప్తంగా

సామగ్రి రవాణాలో జాగ్రత్తలు తీసుకోండి



ఎడ్లబండి యజమానితో మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుక, మట్టి, సిమెంట్, ఇనుము తదితర సామగ్రి రవాణా సందర్భంలో లారీలు, ట్రిప్పర్లు, ట్రాక్టర్లు, ఎద్దుల బండ్ల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ సూచించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక మన్సూర్ నగర్, రంగనాయకులపేట, పినాకిని పార్కు, పెన్నా బ్యారేజీ తదితర ప్రాంతాల్లో కమిషనర్ గురువారం పర్యటించారు. రోడ్లపై ఇసుకను రవాణా చేస్తున్న ఎడ్లబండ్ల యజమానులను ఆపి కమిషనర్ మాట్లాడారు. రవాణా సమయంలో ఇసుక రోడ్లపై పడకుండా వాహనం నలువైపులా చెక్కలు, ఇసుకపై పట్టాను కప్పుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించకుంటే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గణేష్ ఘాట్, పెన్నా బ్యారేజీ సమీపంలో వినాయక చవితి సందర్భంగా చేస్తున్న ముందస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భగత్‌సింగ్ కాలనీ టిడ్కో గృహ ప్రాంగణాలను పరిశీలించారు. అక్కడ వసతులు, సౌకర్యాలపై ప్రజలతో మాట్లాడి తెలుసుకున్నారు. గృహాలు మంజూరైన వారు నివాసాల్లో చేరేలా చర్యలను వేగవంతం చేయాలన్నారు.

రసాయన ఎరువులను తగ్గించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి

కోవూరు: రైతులు వ్యవసాయ సాగులో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి కోరారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన రసాయన పద్ధతులతో భూమి సారవంతం తగ్గిపోతోందని, జీవవైవిధ్యం తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా మంచి దిగుబడితో పాటు భూసారం పెరుగుతుందన్నారు. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ నవధాన్యాల కిట్లు అందిస్తోందన్నారు. ఇవి భూసారాన్ని పెంచడంతో పాటు, పంటల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతాయని వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకురాలు జి.అనిత, మండల వ్యవసాయాధికారులు టి.రజని, ఎస్.శ్రీహరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వెంకటాచలం: గడ్డిమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఇస్కపాళేనికి చెందిన నరాల బలరామయ్య (59) కొన్నేళ్లుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం తన నివాసంలో గడ్డిమందు తాగి పడిపోయాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గురువారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బలరామయ్య కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి నిధులతో పంట కాలువ పనులు



మనుబోలు: మండల కేంద్రంలో రూ.92 వేలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పంట కాలువలను అభివృద్ధి చేస్తున్నట్లు ఎంపీడీఓ జలజాక్షి తెలిపారు. మనుబోలు పరిధిలోని పొలాల్లో జరుగుతున్న పంట కాలువల పనులను గురువారం ఆమె పరిశీలించారు. మస్టర్ ప్రకారం కూలీలు వస్తున్నారా? లేదా? అని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో రైతులకు అవసరమైన పనులు చేస్తున్నామన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు తెలిపారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీఏలు గుర్రప్ప, ఎఫ్ఏ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడకూ కూటమి మోసాలు

- క్షేత్రస్థాయిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి
- రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: కూటమి ప్రభుత్వ మోసపూరిత హామీలను రూరల్‌లోని వాడవాడకూ తీసుకెళ్దామని వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి అన్నారు. 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ', రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం రూరల్ మండల నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో మోసపు హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారన్నారు. ఈ క్రమంలో గ్రామ కమిటీల ద్వారా ప్రతి ఇంటికీ టీడీపీ వాగ్దానాలు, వాటిని అమలు చేయని తీరును ప్రజలకు అర్థమయ్యేలా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. రూరల్ పరిధిలోని గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వంలో వారు మోసపోతున్న తీరును.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మంచిని వివరించాలన్నారు. రూరల్ నియోజకవర్గంలో ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ మండలాధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్‌రావు, జిల్లా సెక్రటరీ బద్దెపూడి వెంకట్రావు, శండి సురేష్, ఎంపీటీసీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, గుణపాటి శ్రీనివాసులురెడ్డి, చింత సురేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, జనార్దన్, రూరల్ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల కొరతను తీర్చాలి



ఎస్టీయూ సభ్యత్వ నమోదులో నాయకులు

నెల్లూరు (టౌన్): నగరపాలక సంస్థ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని ఎస్టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు రాజమనోహర్, ప్రధాన కార్యదర్శి నరసింహం తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద పిల్లలు చదివే పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేనందున కొందరిపై భారం పడుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ కార్పొరేషన్ బాధ్యులు వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని ఐటీడీఏ పీఓ మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. నగరంలోని దర్గామిట్టలో ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలను పరిశీలించి ఉపాధ్యాయులు, సిబ్బందిని పలు అంశాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు త్వరలో వినియోగంలోకి వస్తాయన్నారు. అనంతరం హాస్టల్ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో క్రీడా మైదాన పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ పరిమళ, ఏఎంఓ శాంతికుమారి, ఇంజినీర్ షకీనా, ప్రిన్సిపల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

వడ్డెర మహాసభల విజయవంతానికి పిలుపు



ప్రచార వాహనాల ప్రారంభం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో 27, 28వ తేదీల్లో నిర్వహించే ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ పిలుపునిచ్చారు. నగరంలోని బాలాజీనగర్‌లో వడ్డెర మహాసభల ప్రచార వాహనాలను గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెరలకు రక్షణ లేకుండా పోతోందని, తమకు సామాజిక రక్షణ చట్టం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా నాయకులు బత్తల రమణయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి



నెల్లూరు (పొగతోట): కృష్ణపట్నం పోర్టులో బీపీసీఎల్ కంపెనీ ద్వారా ఆయిల్ రవాణా చేస్తున్న ట్రాన్స్‌పోర్టర్లకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌పోర్టర్లు కోరారు. ఈ మేరకు డీఎస్‌ఓ విజయ్‌కుమార్‌కు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టులో బీపీసీఎల్‌కు రవాణా టెండర్ల పరిశీలనలో లోపాలు జరిగాయని, ఈ విషయం బీపీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. సంస్థలో అనేక అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, దీనిపై పూర్తిస్థాయిలో అధికారులు విచారించాలన్నారు.

వేగవంతంగా భూసేకరణ ప్రక్రియ



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(అర్బన్): జిల్లాలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లో భూసేకరణకు సంబంధించి ఆర్డీఓలు, తహసీల్దార్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే బ్రాడ్‌గేజ్ నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ గురించి చర్చిస్తూ భూమి ఇచ్చిన రైతులకు నష్ట పరిహారం తక్షణమే చెల్లించాలన్నారు. రైల్ ఓవర్ బ్రిడ్జిలు, రైల్ అండర్ బ్రిడ్జిలు ఏర్పాటుకు సంబంధించి పనులు త్వరగా చేపట్టాలన్నారు. రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాళెం-దగదర్తి రోడ్డు పనులు, గిలకపాడు, వీరయ్యపాళెంలో తాగునీటి పైప్‌లైన్ పనుల గురించి సమీక్షించారు. బద్వేలు నుంచి నెల్లూరుకు ఫేజ్-1, ఫేజ్-2 కింద జరుగుతున్న నేషనల్ హైవే పనులు, భూసేకరణ, పరిహారం గురించి చర్చించారు. రోడ్లు నిర్మించే క్రమంలో అవసరమైన చోట అటవీశాఖ అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్వో హుస్సేన్ సాహెబ్, డీఎఫ్‌ఓ మహబూబ్‌బాషా, ఆర్డీఓలు పావని, అనూష, వంశీకృష్ణ పాల్గొన్నారు.

కలెక్టర్‌తో కేంద్ర బృందం భేటీ

జిల్లాలో కేంద్ర సాయంతో అమలవుతున్న పథకాల పనితీరును పరిశీలించేందుకు జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం గురువారం నెల్లూరుకు చేరుకుని కలెక్టర్ ఆనంద్‌తో భేటీ అయ్యారు. బృంద సభ్యులు డాక్టర్ ప్రశాంత్‌కుమార్, డాక్టర్ మణికందన్‌లు కలెక్టర్‌తో చర్చించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ న్యూఢిల్లీ నుంచి వచ్చిన జాతీయ బృందానికి పూర్తి సహకారాలు అందించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంక్షేమ పథకాలను అధికారులు వివరించాలని కోరారు. వారు వచ్చే నెల 2వ తేదీ వరకు పరిశీలించి నివేదికను కేంద్రానికి అందిస్తారని తెలిపారు. సమావేశంలో డ్వామా పీడీ గంగాభవాని, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని 51వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి సందీప్ ఆధ్వర్యంలో పలువురు డివిజన్ నాయకులు, కార్యకర్తలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నారు.

సన్మానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ఉద్యోగులకు 15 రోజుల వేతనాన్ని అదనంగా అందించడంతో చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డిని ఎన్‌డీసీసీబీఈఏ అసోసియేషన్ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న డీసీసీబీ కార్యాలయంలో ఈ మేరకు సత్కరించి కేక్ కటింగ్ చేశారు. బ్యాంక్ సీఈఓ శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు కుమార్‌పాల్, వెంకటేశ్వర్లు, రాజు, మహేష్, ఖాసింవలీ, సుష్మారెడ్డి, హరి, రియాజ్, గురునాథం, కృష్ణయ్య, గౌస్‌బాషా, చెంగయ్య, రామ్‌సాయి పాల్గొన్నారు.

అమీర్‌జాన్‌కు అవార్డు

నెల్లూరు(బృందావనం): సింహపురి చిత్రకారుడు అమీర్‌జాన్ 'ఆర్ట్ ఎక్స్‌పర్ట్' అవార్డుకు ఎంపికయ్యారు. రాజమహేంద్రవరంలో 'భగీరథి ఫౌండేషన్' ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో అమీర్‌జాన్ రూపొందించిన వేదగిరి 'నరసింహకొండ' కాన్వాస్‌కు అవార్డు వచ్చింది. దీనిని ఈనెల 27న అందుకోనున్నారు.

నేత్రదానం



రామకృష్ణయ్య(ఫైల్)

నెల్లూరు(అర్బన్): నగరంలోని కామాటి వీధికి చెందిన ఏల్చూరి రామకృష్ణయ్య (80) గురువారం ఆయన నివాసంలో మృతిచెందారు. ఆయన కుటుంబసభ్యుడు లోకేశ్ అంగీకారంతో వాసవి వనిత లెజెండ్ ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి హేమలత, కావలి అభయం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యురాలు ఈవీఎస్ శ్రీవాణిల సహకారంతో మృతుని నేత్రాలను నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ మృతుని నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌ను అందించారు. ఎవరైనా మరణానంతరం నేత్రదానం చేయదలిచిన వారు 99595 89321 నంబర్‌కు ఫోన్ చేయాలని సునీల్ కోరారు.

టోర్నీ విజేతలు ఎస్పీడీసీఎల్ అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆలిండియా 47వ ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు బ్రిడ్జి టోర్నమెంట్‌లో ఎస్పీడీసీఎల్ అధికారులు విజేతలుగా నిలిచారు. నగరంలోని నెల్లూరు క్లబ్‌లో గురువారం నిర్వహించిన బ్రిడ్జి టోర్నీ బోర్డు ఏ విభాగంలో ఎస్పీడీసీఎల్ అధికారులు గెలుపు సాధించారు. విజేతల్లో ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్, తిరుపతి కార్పొరేట్ కార్యాలయ ఈఈ ఆర్.శంకర్, డీఈఈ ప్రభాకర్, అమీర్‌బాషాలు ఉన్నారు.

మంత్రి పార్థసారథి పర్యటన నేడు

నెల్లూరు(అర్బన్) : రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన ఉదయం 10 గంటలకు నెల్లూరు చేరుకుంటారు. నగరంలోని వడ్డిపాళెంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30కి ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు యాదవ బజార్‌లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4.30 గంటలకు కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు మండలంలోని భీమవరం గ్రామంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యశాఖ అధికారులు

నెల్లూరు(అర్బన్): డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత ఆదేశాల మేరకు నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లపై వైద్యాధికారులు గురువారం తనిఖీలు చేశారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, వెంకటాచలం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వేదవల్లి వాణిశ్రీ, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నర్సింహులు, బ్రైవే ఫౌండేషన్, సరోగసి యాక్ట్ ఇంప్లిమెంటేషన్ స్టేట్ బోర్డు మెంబర్ కవితారెడ్డిలు నగరంలోని లోటస్ ఆస్పత్రి, ఆండాళ్ హాస్పిటల్, సరయు ఆస్పత్రి, ఇమేజ్ స్కాన్ తదితర సెంటర్లను తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో రికార్డులు పరిశీలించారు. అనంతరం అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ల యజమానులు పీసీపీఎన్‌డీటీ చట్టం నియమాలను తప్పకుండా పాటించాలని సూచించారు. లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్కానింగ్ వివరాలకు సంబంధించిన ఫారమ్-4ను క్రమం తప్పకుండా ప్రతినెలా మొదటి వారంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా టీబీ కో-ఆర్డినేటర్ విజయకుమార్, హరీష్, భవ్య ఆర్గనైజేషన్ ఫీల్డ్ కో-ఆర్డినేటర్ సరిత తదితరులు పాల్గొన్నారు.

నగర సుందరీకరణకు అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): ప్రజలకు మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనతో పాటు నగర సుందరీకరణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని ఉద్యాన శాఖ, ఇంజినీరింగ్ విభాగం అధికారులను కమిషనర్ వైఓ నందన్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏపీ గ్రీనరీ బ్యూటిఫికేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఉద్యాన శాఖ, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర వ్యాప్తంగా మొక్కలను నాటి వాటిని సంరక్షించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యాన శాఖతో కలిసి ఇంజినీరింగ్ విభాగం సమన్వయంగా విధులను నిర్వహిస్తున్నారని తెలిపారు. నగర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం, ట్రీ గార్డుల ద్వారా వాటిని సంరక్షించడం, డివైడర్ల మధ్యలో మొక్కలను సంరక్షించడం, ఫౌంటెయిన్ల పర్యవేక్షణ, పార్కుల నిర్వహణ, డ్రిప్ విధానం ద్వారా మొక్కలకు నీటి సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పర్యావరణ సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారావు, ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతుజానీ, డీఈ రఘురామ్, ఏఈలు పాల్గొన్నారు.

పీ-4 సర్వే ద్వారా లబ్ధిదారులను గుర్తించండి

ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యంతో అత్యంత నిరుపేదలను గుర్తించి, వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు పీ-4 సర్వే ద్వారా నగరపాలక సంస్థ పరిధిలోని లబ్ధిదారులను గుర్తించాలని వార్డు సచివాలయ ఎడ్యుకేషన్ కార్యదర్శులను కమిషనర్ నందన్ ఆదేశించారు. నగరంలోని 54 డివిజన్లలో పీ-4 సర్వేపై ప్రత్యేక శిక్షణను ఎస్ఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం నిర్వహించారు. వార్డు సభల ద్వారా ప్రజల ఆర్థిక స్థితి, మౌలిక సదుపాయాలు తదితర వివరాలను పునః పరిశీలించి ఆన్‌లైన్ చేయించాలని సూచించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులను సమన్వయం చేసుకుని విజయవంతం చేయాలని సూచించారు. డిప్యూటీ డైరెక్టర్ మాధురి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా తాగునీటి సరఫరా

నగరంలోని అన్ని డివిజన్లలో క్రమం తప్పకుండా తాగునీరు సరఫరా అయ్యేలా పర్యవేక్షించాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. వారాంతపు సమీక్షలో భాగంగా ఇంజినీరింగ్, హౌసింగ్, టిడ్కో విభాగాలతో కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ప్రతి కార్యదర్శి ఉదయం 6 గంటలకు క్షేత్రస్థాయిలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల ద్వారా జరిగే తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని సూచించారు. తాగునీటి కుళాయి కనెక్షన్లు, విద్యుత్ వీధిదీపాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, పబ్లిక్ హెల్త్ విభాగం ఎస్ఈ మోహన్‌రావు, ఈఈలు రహంతు జానీ, శేషగిరిరావు, డీఈఈలు అనిల్, రఘురామ్, ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతతో సమాజాభివృద్ధి

- జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): మహిళా సాధికారతతో సమాజాభివృద్ధి సాధ్యమని, ప్రస్తుతం మహిళలు అవకాశాలు అందిపుచ్చుకుని అన్నిరంగాల్లో ముందంజలో ఉన్నారని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీటీసీ సభ్యులు, మహిళా మండల పరిషత్ అధ్యక్షులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు పాలనలో పగ్గాలు చేపట్టినప్పటి నుంచి పారదర్శకత పెరిగిందన్నారు. వనరుల వినియోగం సక్రమంగా జరుగుతోందన్నారు. తక్కువ విద్య, శిక్షణా లోపం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోలేకపోవడం, ఆత్మవిశ్వాస లోపం, సామాజిక ఒత్తిళ్ల వల్ల మహిళలు కాస్త వెనుకడుగు వేస్తున్నారని, వీటిని తప్పకుండా అధిగమించాలన్నారు. శిక్షణా కార్యక్రమాల్లో నాయకత్వం, నిధుల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలన్నారు. డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానంపై సాధన చేయాలన్నారు. చదువు, చైతన్య వంతమైన మహిళ గ్రామ రూపురేఖలను మార్చగలదన్నారు. శిక్షణా కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, మాస్టర్ ట్రెయినీలు పాల్గొన్నారు.

బహిరంగ ధూమపానంపై కొరడా



ధూమపానం చేస్తున్న వారికి జరిమానా విధిస్తున్న ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు

నెల్లూరు(క్రైమ్): కొందరు ధూమపానానికి బానిసలై ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లో పొగతాగే వారితో చుట్టుపక్కల వారు ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో పాటు యువత, విద్యార్థులు ప్రభావితమవుతున్నారు. పొగాకు వినియోగాన్ని తగ్గించడం, ప్రజారోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సిగిరెట్స్ అండ్ టొబాకో ప్రొడెక్ట్స్ యాక్ట్స్ 2023 (కోట్పా)ను తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. స్పెషల్ డ్రైవ్ పేరిట బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, నిబంధనలకు విరుద్ధంగా పొగాకు ఉత్పత్తులను విక్రయించే వారిపై పోలీసు అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. వందల సంఖ్యలో ధూమపాన ప్రియులకు జరిమానాలు విధించడంతో పాటుగా కోట్పా చట్టంపై అవగాహన కల్పిస్తున్నారు.

ఉల్లంఘనులకు రూ.200 జరిమానా

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం చట్టరీత్యా నేరం. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.200 జరిమానా విధించవచ్చు. బార్లు, రెస్టారెంట్లు, హోటల్స్, సినిమా థియేటర్లు, విశ్రాంతి మందిరాలు, బస్టాపులు, ప్రజారవాణా వాహనాలు తదితర ప్రాంతాల వద్ద ధూమపానం చేయరాదు. మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదు. పాఠశాలలకు వంద గజాలు(12.4అంకణాలు)లోపు పొగాకు ఉత్పత్తులు అమ్మడం, సేవించడం నేరం. నియమాలను తరచూ అతిక్రమించేవారిపై బీఎన్ఎస్ చట్టం కింద కఠిన చర్యలకు కోట్పా సిఫార్సు చేస్తుంది. పొగరాయుళ్లు బహిరంగ ప్రదేశాల్లో దమ్ముకొడితే చిక్కులు తప్పవంటున్నారు పోలీసులు.